క్లుప్తంగా

నేడు సోలార్‌పై అవగాహన

టెక్కలి: సోలార్ వినియోగం, జీఎస్టీ తగ్గింపుపై శనివారం టెక్కలిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ నరసింహకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ కట్టడాలు తొలగింపు

టెక్కలి: టెక్కలి ఎన్టీఆర్ కాలనీలోని పోలీస్ స్టేషన్ వెనుక వీధిలో ఆక్రమ కట్టడాలను శుక్రవారం అధికారులు తొలగించారు. మురుగు నీరు వెళ్లకుండా అడ్డంగా కట్టడాలు చేస్తున్నారంటూ ఇటీవల స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారుల ఆదేశాల మేరకు ఆయా కట్టడాలను తొలగించారు.

చిన్నారి వైద్యానికి సాయం



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ గ్రామానికి చెందిన బండారు పావని ఏడాదిన్నర కుమార్తె దియా న్యుమోనియా వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళంలో చికిత్స పొందుతోంది. మెరుగైన ఆరోగ్యానికి రూ. లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో పలువురు యువకులు, ట్రస్టులు ఆర్థిక సాయం అందించారు. ఒడిశా రాష్ట్ర సవరదేవిపేట (పేటూరు)కు చెందిన మృత్యుంజయ ఫౌండేషన్ సభ్యులు స్పందించి శుక్రవారం పావనికి పది వేల రూపాయలు అందించారు.

టపాసులు జాగ్రత్తగా కాల్చాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంచిలి: చిన్నపిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సోంపేట అగ్నిమాపక అధికారి ఆర్.సూర్యారావు అన్నారు. దీపావళి నేపథ్యంలో చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన నివారణ చర్యలపై బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అగ్నిమాపక అధికారి సూర్యారావు చేతులమీదుగా మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు ముప్పన సోమేశ్వరరావు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు రశీదులతో ఉద్యోగులు

పలాస: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవోల సంఘం నాయకుడు బోనెల గోపాల్ కోరారు. ఈ మేరకు రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందులో భాగంగా సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో తుల సంక్రమణం పూజలు



ఇచ్ఛాపురం రూరల్: పేటూరులో కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: తుల సంక్రమణం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో కచేరీలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఇచ్ఛాపురం: తుల సంక్రమణం సందర్భంగా గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తైల, సిందూర మర్దనలు, కుంకుమపూజ, సహస్రనామార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు.



ఇచ్ఛాపురం: ప్రత్యేక అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు



కవిటి: లండారిపుట్టుగలో కోటి సంతకాల సేకరణ పత్రాన్ని అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తదితరులు



సోంపేట: సిరిమామిడి పంచాయతీలో మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు



పలాస: రంగోయి గ్రామంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వైద్య కళాశాలలను కాపాడుకుందాం

ప్రభుత్వ వైద్య కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే కూటమి ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు పలు గ్రామాల్లో శుక్రవారం ఉప్పెనలా సాగాయి. రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టడంతోపాటు ప్రభుత్వ పరంగా వైద్య కళాశాలలు ఉంటే ప్రజలకు చేకూరే లబ్ధిని నాయకులు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



నందిగాం: హరిదాసుపురంలో సంతకాల సేకరణ పత్రాలు అందజేస్తున్న టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



వజ్రపుకొత్తూరు: కొమరల్తాడలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ పోస్టర్‌లను ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు పాలిన శ్రీనివాసరావు, చింత రాజు తదితరులు



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్రలో సంతకాల సేకరణలో మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజారావు తదితరులు

ఇచ్ఛాపురం.. అల్లంత దూరం!



ఇచ్ఛాపురం మండల మహిళా సమాఖ్య భవనం

- పనిచేసేందుకు ముందుకు రాని ఏపీఎంలు
- జాయినింగ్ మరునటి రోజే పరార్

ఇచ్ఛాపురం రూరల్:

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇచ్ఛాపురం మండలంలో పని చేసేందుకు చాలా మంది అధికారులు ఆసక్తి చూపడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక్కడి నేతల ఒత్తిడే కారణంగా చెబుతున్నారు. పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాలలో సామాజిక సమీకరణ, ఉపాధి అవకాశాలు పెంచడం, మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సాహించి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యకలాపాలను పర్యవేక్షించే ఇచ్ఛాపురం వెలుగు (సెర్ప్) కార్యాలయం కలాపాలకు కొన్ని రోజుల నుంచి బ్రేక్ పడింది. అందుకు కారణం గత నాలుగు నెలలు నుంచి ఏపీఎం లేకపోవడమే. ఇచ్ఛాపురం మండలంలో 1340 స్వయంసహాయక సంఘాలు, 36 గ్రామ సంఘాలు పనిచేస్తుండగా, 14,456 మంది సభ్యులు ఉన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు సంబంధించి స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు, వారికి బ్యాంకు రుణాలు, వ్యవసాయ మహిళలను ప్రోత్సాహించడం, బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్న వారిచే తిరిగి కట్టించేందుకు సీసీలు, వీవోఏలకు అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయడం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీఎం) విధులు. అయితే ఇచ్ఛాపురం సెర్ప్ విషయానికొస్తే ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించేందుకు ఏ ఉద్యోగీ సాహసించడం లేదు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలపై పాలకుల పెత్తనం, అధికారులపై ఒత్తిడి కారణంగా ఉద్యోగులు పని చేసేందుకు ఇష్టపడటం లేదు. గతంలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన ఏపీఎం సనపల ప్రసాదరావు పలుమార్లు ఉత్తమ ఏపీఎంగా ప్రభుత్వం నుంచి అవార్డులు తీసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అతనిపై అవినీతి పరుడంటూ పాలకులు ముద్ర వేసేందుకు ప్రయత్నించారు. తమకు అనుకూలమైన వారికి సీఎఫ్‌లగా నియమించాలని ఎమ్మెల్యే స్థాయి వ్యక్తుల నుంచి సైతం ఆయనపై ఒత్తిడి తీసుకురావడం, మండల పరిషత్ సమావేశాల్లో నిలదీయడం, అవమాన పరచడంతో ఆయన ఈ ఏడాది జూన్ నెలలో సోంపేట బదిలీపై వెళ్లిపోయారు. అనంతరం సీతంపేటలో పనిచేసిన పార్వతిని ఏపీఎంగా బాధ్యులు ఇవ్వగా.. ఆమె రెండే రోజులు పనిచేసి రికమండేషన్‌తో వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిపోయారు. వారం రోజుల్లో మందస మండలంలో ఏపీఎంగా పనిచేసిన కూర్మారావు సెప్టెంబర్ 10న బాధ్యతలు తీసుకొని తెల్లారే సరికి మరల మందసకు బదిలీపై వెళ్లిపోవడంతో సెర్ప్ సేవలు పడకేశాయి. ప్రస్తుతం కవిటి మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న గోవింద్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నప్పటికీ...ఆయన ఏదో అలా చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారే తప్పా స్వయం సహాయక సంఘాలపై దృష్టి పెట్టడం లేదనే చెప్పాలి.



ఖాళీగా ఉన్న ఏపీఎం కుర్చీ

నియమాకానికి మరికొన్ని రోజులు

ఇచ్ఛాపురంలో పూర్తిస్థాయిలో ఏపీఎంను నియమించేందుకు మరికొన్ని రోజులు పడుతోంది. ప్రస్తుతం కవిటి మండలానికి చెందిన ఏపీఎంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పర్యవేక్షణ బాధ్యత ఎప్పటికప్పుడు వీవోఏలు, సీసీలు చూస్తున్నారు. సంఘాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాను.

– పెద్దింటి కిరణ్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

'సాక్షి'పై కుట్రలు తగవు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రంలో కల్తీ మద్యం దందాపై నిజాలను వెలికితీస్తున్న సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, ఆ సంస్థ ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై కేసు నమోదు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలిన శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ వజ్రపుకొత్తూరు జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బమ్మిడి ఆనందరావు, దేవా, లక్ష్మణ్, జర్నలిస్టులు పి.శోభన్‌రావు, జి.శ్రీనివాసరావు, బమ్మిడి వెంకటరమణ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వచ్చే నెల 14న ప్రతిభ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండల స్థాయి ప్రతిభ పోటీలను వచ్చే నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు కంబాల రాయుడుపేట మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లఖినాన కరుణాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం ఆవిష్కరించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నట్లు పోటీలకు ప్రభుత్వ పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు వారి విద్యార్థుల పేర్లను నవంబర్ మూడో తేదీలోగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అక్టోబర్ నెల వరకు పూర్తయిన సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయని వివరించారు. పూర్తి వివరాలకు 9177305519, 9502420438 నంబర్లను సంప్రదించాలన్నారు. సర్పంచ్ వంక చిరంజీవి, మాజీ సర్పంచ్ కె.దానేసు, ఎంపీటీసీ సభ్యుడు కారి వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుడిదోమ నివారణ చర్యలు చేపట్టండి

నందిగాం: ఖరీఫ్‌లో సాగు చేస్తున్న సాంబ, స్వర్ణ రకాల వరిపంటకు కొద్దిమేర సుడిదోమ ఆశించిన నేపథ్యంలో నివారణ చర్యలు తీసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహన రావు అన్నారు. పెద్దతామరాపల్లిలో వరి పంట పొలాలను, వాటికి ఆశించే చీడపీడలను మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంబ, స్వర్ణ రకాలకు సుడిదోమ తక్కువ స్థాయిలో ఆశించి ఉందన్నారు. ఒక వేళ ఎక్కువ స్థాయిలో ఉంటే ఎసిఫేట్ మందును ఒక లీటర్ నీటికి 1.5 గ్రాములు లేదా పైమిట్రోజన్ ఒక లీటర్ నీటికి 0.6 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పొటాష్‌ను తప్పని సరిగా వినియోగించాలన్నారు. పరిశీలనలో పలువురు వీఏఏలు పాల్గొన్నారు.



పెద్దతామరాపల్లిలో సుడిదోమ ఆశించిన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కార్మిక వ్యతిరేక బిల్లును ఉపసంహరించుకోవాలి

పలాస: కార్మికులు రోజుకు 13 గంటలు పనిచేయాలని శాసనసభలో ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మిక సమాఖ్యతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో జి.వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజుకు ఎనిమిది గంటల పనిదినాన్ని కొనసాగించాలని, రాత్రి వేళల్లో పనిచేసే విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో మహిళా కార్మికులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్షుడు మద్దిల ధర్మారావుతో పాటు కార్యదర్శి పుచ్చ దుర్యోధనరావు, కారి పురుషోత్తం, గర్తం కూర్మారావు, మామిడి గణపతి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు సాలిన వీరాస్వామి, డొక్కర లక్ష్మణరావు, సీపీఐఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వంకల మాధవరావు, మురిపింటి గంగయ్య, ధనలక్ష్మి, సీఐటీయూ నాయకుడు నెయ్యిల గణపతి పాల్గొన్నారు.



నిరసనలో ప్రజా సంఘాల ప్రతినిధులు

వైద్యాధికారుల సమ్మెకు పీహెచ్‌సీ సిబ్బంది మద్దతు



కంచిలి పీహెచ్‌సీ వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది

కంచిలి: వైద్యాధికారులు తమ డిమాండ్ల సాధన కోసం 13 రోజులుగా చేపడుతున్న సమ్మెకు పీహెచ్‌సీ సిబ్బంది మద్దతు పలికారు. కంచిలి, మఠం సరియాపల్లి పీహెచ్‌సీల వద్ద ఆయా సిబ్బంది శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి తమ డాక్టర్ల నిరసనలకు ఏకీభవిస్తూ వారి డిమాండ్లను తీర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తమవంతు నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌హెచ్ వైద్యులు, ఏపీవీవీపీజేఏసీ, ఎన్‌హెచ్ఎస్‌జేఏసీ, సీఐటీయూ, ఏపీ మెడికల్ టెక్నీషియన్ అసోసియేషన్, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్, ఏపీ యునైటెడ్ వార్డ్ అండ్ విలేజ్ అసోసియేషన్, ఏఐటీయూసీ మద్దతును ప్రకటిస్తూ ప్రభుత్వం వారి పట్ల మెండి వైఖరి విడనాడి వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

భయపెడుతున్న మలుపులు!



పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా ఉన్న పోలవరం-లింగాలవలస మలుపు



జి.జగన్నాథపురం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

- మలుపులు వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు

టెక్కలి రూరల్: ప్రమాదకరంగా ఉన్న మలుపులు వాహనదారులను భయపెడుతున్నాయి. టెక్కలి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లింగాలవలస గ్రామ సమీపంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మలుపు కనిపించపోవడంతో కొత్తగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించపోవడంతో ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో అతివేగంగా వచ్చే వాహనం మలుపుని గుర్తించకపోవడంతో అదుపు తప్పి సమీపంలోని పొలాల్లోకి దూసుకుపోయి ప్రమాదాలకు గురౌతున్నారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద మలుపుండి ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి. అలాగే నర్సిపురం, పెద్దసాన, సన్యాసి నీలాపురం, గూడేం, జి.జగన్నాథపురం సమీపంలో ఉన్న మలుపులు సైతం ప్రమాదకరంగా ఉండటంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు.

నిత్యం ప్రమాదాలే..

పోలవరం గ్రామం నుంచి లింగాలవలస గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధిక మలుపులతో ఉంది. ముఖ్యంగా లింగాలవలస వద్ద గల నందసాగరం సమీపంలో ఉన్న భారీ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఆ రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కల్పించపోవడం లేదు. సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలి.

–చింతాడ సూర్యం, పోలవరం గ్రామం

అవగాహన బోర్డులు బోర్లా పడ్డాయి!

టెక్కలి: యువత డ్రగ్స్ బారిన పడకూడదంటూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులు ప్రస్తుతం బోర్లా పడ్డాయి.

జాతీయ రహదారిలో కె.కొత్తూరు, జియో బంక్ సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం అవి పడిపోయి నిర్లక్ష్యానికి గురయ్యాయి.

ఇదే మార్గంలో నిత్యం పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పడిపోయిన బోర్డులను గమనించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జియో బంక్ సమీపంలో నేలపై పడిపోయిన డ్రగ్స్ అవగాహన బోర్డు



కె.కొత్తూరు వద్ద వంతెనకు ఆనుకుని పడిపోయిన బోర్డు

నైపుణ్యంపై అవగాహన

సోంపేట: విద్యార్థులు విజయపథంలో సాగిపోవాలి తప్పితే ఆగిపోకూడదని మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అన్నారు. గొనకపాడు ఉన్నత పాఠశాలలో జీవితపాఠం-జీవన నైపుణ్యాలు అనే అంశంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. జీవితంలో జయాపజయాలు, చీకటి వెలుగులు, సుఖదుఃఖాలు, భయం..బాధలు ఉంటాయన్నారు. వాటిని అధిగమిస్తూ.. కాలన్ని వృథా చేయకుండా ధైర్యంతో ముందడగు వేయాలన్నారు. కఠోర శ్రమతో దేనినైనా సాధించవచ్చునన్నారు. ప్రధానోపాధ్యాయులు టి.కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గణపతి